# వేగుచుక్క

VC NEWS

పీడిత ప్రజల గొంతుక...

TELUGU DAILY NEWS

www.veguchukkanews.com

నిజామాబాద్ అక్టోబర్ 31 గురువారం 2024

వెల: రూ.3/- పేజీలు : 4 సంపుటి:02 సంచిక: 104








PUBLISHED FROM HYDERABAD CIRCULATED BY RANGAREDDY, NALGONDA, KHAMMAM, KARIMNAGAR, WARANGAL, MAHABOOBNAGAR, MEDAK, NIZAMABAD, ADILABAD




# ఎక్స్‌రేలా కులగణన

- ప్రజల స్థితిగతులపై మెగా హెల్త్‌చెకప్ లాంటిది
- దీనిపై 33 జిల్లాలకు పార్టీ పరిశీలకులను నియమించాలి
- నవంబరు 30లోగా పూర్తిచేసి.. స్థానిక పోరుకు వెళ్దాం
- పార్టీకి నష్టం కలిగించేలా ఎవరైనా మాట్లాడితే సహించం
- గాంధీ కుటుంబం మాటంటే మాటే
- పీసీసీ సమావేశంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి

2లో

రాజకీయాల్లో ఎన్ని ఒడిదొడుకులు, అడ్డంకులు వచ్చినా ప్రజలకు ఇచ్చిన మాట నెరవేర్చడంలో సోనియమ్మ సఫలీకృతమయ్యారు. తెలంగాణను ఏర్పాటు చేసి ఇచ్చిన మాట నెరవేర్చారు. గాంధీ కుటుంబం ఒక మాట ఇస్తే ఎంతమంది అడ్డు వచ్చినా నెరవేరి తీరుతుంది. రేవంత్‌రెడ్డినా, మహేశ్‌గౌడా అనేది కాదు. మనం మల్లికార్జున ఖర్గే, రాహుల్‌గాంధీ ఇచ్చిన హామీలను నిలబెట్టే వారసులం.

**-సీఎం రేవంత్**

# పంచాయితీలను నిర్వీర్యం చేస్తున్న రాష్ట్రం

- కేంద్రం నిధులు ఇచ్చినా దారి మళ్లించిన రేవంత్
- రు.1200కోట్లు విడుదల చేస్తే..కేవలం 200 కోట్లు ఖర్చు
- సర్కార్ తీరుపై మండిపడ్డ బిజెపి ఎంపి రఘునందన్ రావు



**హైదరాబాద్:** గ్రామాల అభివృద్ధిని కాంక్షించి కేంద్రం నిధులు విడుదల చేస్తున్నా ప్రభుత్వాలు నిర్లక్ష్యంగా వ్యవహరించడం వల్ల అభివృద్ధి కుంటుపడుతోందని బిజెపి మెదక్ ఎంపీ రఘునందన్ రావు అన్నారు. గ్రామాలకు కేటాయించిన నిధులను పక్కదారి పట్టించడం సరికాదన్నారు. పల్లె ప్రగతి నిధులు విడుదల చేయకుండా గ్రామీణ ప్రాంతాల్లో అభివృద్ధి కుంటుపడిందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం నిర్వాకంతో పంచాయతీ సెక్రటరీలు కూడా సొంత డబ్బుతో పనులు చేయించారన్నారు. రాష్ట్రంలో ఎవరు అధికారంలో ఉన్నా గ్రామాలు బాగుండాలని కేంద్ర ప్రభుత్వం నిధులు విడుదల చేస్తుందని రఘునందన్ రావు అన్నారు. ఆరునెలల క్రితం కేంద్రం 1200 కోట్ల రూపాయలు విడుదల చేసిందని తెలిపారు. బుధవారం ఆయన హైదరాబాద్‌లోని భాజపా కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతూ.. గ్రామ పంచాయతీలను రాష్ట్ర ప్రభుత్వం నిర్వీర్యం చేస్తున్నదని విమర్శించారు. కేంద్ర ప్రభుత్వం మహాత్మాగాంధీ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద రూ.1200 కోట్ల నిధులు విడుదల చేస్తే.. రాష్ట్ర ప్రభుత్వం కేవలం రూ.200 కోట్లు మాత్రమే ఖర్చు చేసిందన్నారు. మిగిలిన రూ.1000 కోట్ల నిధులను రేవంత్‌రెడ్డి సర్కారు ఇతర కార్యకలాపాలకు దారి మళ్లించిందని ఆరోపించారు. గ్రామ పంచాయతీల్లో విద్యుత్ బిల్లులు చెల్లించలేని పరిస్థితి ఉందన్న రఘునందన్.. పల్లె ప్రగతికి నిధులు వెచ్చించడం లేదని దుయ్యబట్టారు. పంచాయతీ కార్యదర్శులు సొంతంగా శానిటైజేషన్ కోసం రూ.3 లక్షల నుంచి రూ.5 లక్షల వరకు ఖర్చు చేస్తున్నారని తెలిపారు. గ్రామాల్లో పనులు పూర్తి చేసి బిల్లుల కోసం ఎదురు చూస్తున్నారని.. కేవలం 200 కోట్ల రూపాయలు మాత్రమే ఖర్చు చేసి మిగిలిన నిధులు దారి మళ్లించారని మండిపడ్డారు.

# మూసీ సుందరీకరణతో పేదల ఇళ్ల కూల్చివేత

- మూసీ సుందరీకరణతో పేదల ఇళ్ల కూల్చివేత
- ఇళ్ల కూల్చివేతను తప్పకుండా వ్యతిరేకిస్తాం
- మల్లన్న సాగర్‌ను మించి మూసీకి పరిహారం ఇవ్వాలి
- రేవంత్ పాదయాత్ర చేస్తే మేమూ వస్తాం
- కుర్చీకాపాడుకునేందుకే రేవంత్ రెడ్డి తంటాలు
- ఇప్పటికిప్పుడు ఎన్నికలు జరిగితే వంద సీట్లు ఖాయం
- కేసులతో బెదిరింపులకు దిగితే భయపడేది లేదు
- మాజీమంత్రిహరీష్ రావు విమర్శలు



2లో

కేసీఆర్‌కు, రేవంత్‌కు నక్కకు.. నాగలోకానికి ఉన్నంత తేడా ఉందన్నారు. సీనియర్లు తన కుర్చీని గుంజుకోకుండా రేవంత్ చేసుకోవాలని.. తన కుర్చీని ఎప్పుడు గుంజుకుపోతారోనన్న భయంలో రేవంత్ ఉన్నాడన్నారు. ఐదేళ్ల తర్వాత వచ్చేది బీఆర్ఎస్ మాత్రమేనని.. సీఎం అయ్యేది కేసీఆర్ అని స్పష్టం చేశారు. దేశంలో కాంగ్రెస్ మూడుసార్లు ఓడిందని.. మరి కాంగ్రెస్ ఖతం అయిపోయిందా? అంటూ ప్రశ్నించారు. 31 సాకులు చూపుతూ రుణమాఫీ చేయకుండా రేవంత్ రైతులను మోసం చేశారని విమర్శించారు.

## జన్వాడ కేసు: 8 గంటల పాటు ప్రశ్నించి.. రాజ్ పాకాలకు పోలీస్ నోటీసులు



హైదరాబాద్: జన్వాడ కేసులో రాజ్‌పాకాల స్టేట్‌మెంట్‌ను పోలీసులు రికార్డు చేశారు. అనంతరం ఆయనను జన్వాడ నివాసానికి పోలీసులు తీసుకెళ్లారు. మరోసారి జన్వాడ నివాసంలో సోదాలు నిర్వహించారు. అనంతరం రాజ్ పాకాలను మళ్లీ మోకిల పీఎస్‌కు తీసుకెళ్లి విచారించిన పోలీసులు.. 35(3) బీఎంఎస్ యాక్ట్ కింద నోటీసులు జారీ చేశారు. సుమారు 8 గంటల పాటు విచారించారు. విజయ్ మద్దూరి స్టేట్‌మెంట్ ఆధారంగా విచారణ కొనసాగింది.కాగా, రాజ్ పాకాల తన అడ్వకేట్‌తో పాటుగా మోకిలా పీఎస్‌కు వచ్చారు. రాజ్ పాకాలకు మంగళవారంతో హైకోర్టు ఇచ్చిన గడువు ముగియడంతో ఆయన నేడు విచారణకు హాజరయ్యారు. మరోవైపు.. మంగళవారం కూడా రాత్రి విజయ్ మద్దూరి నివాసంలో పోలీసులు సోదాలు నిర్వహించారు. ఆయన ఫోన్‌ను పోలీసులు స్వాధీనం చేసుకున్నట్లు సమాచారం.అనుమతి లేకుండా మద్యం పార్టీ నిర్వహించారనే కారణంతో రాజ్ పాకాల తోపాటు, కొకైన్ తీసుకున్నట్టు నిర్ధారణ అయిన విజయ్ మద్దూరి (56)పై పోలీసులు కేసు నమోదు చేసిన సంగతి తెలిసిందే. ఆదివారం రాత్రి విజయ్ మద్దూరికి 41 సీఆర్‌పీసీ కింద పోలీసులు నోటీసులు ఇచ్చి, స్టేషన్ బెయిల్‌పై విడుదల చేశారు.

# ప్రాణాంతక మయోనైజ్‌పై నిషేధం


## తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయం



**హైదరాబాద్:** ప్రాణాలను హరిస్తున్న మయోనైజ్‌పై నిషేధం విధించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు తెలంగాణ రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ కీలక నిర్ణయం తీసుకుంది. ఆహార ప్రియులు ఎంతో ఇష్టంగా తినే మయోనైజ్ ప్రాణాంతకంగా మారడంతో దీనిపై నిషేధం విధించాలని నిర్ణయించింది. కల్తీ ఆహారం తీసుకొని పలువురు తీవ్ర అనారోగ్యం పాలవుతోన్న ఘటనల నేపథ్యంలో ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. ఫుడ్ సేఫ్టీ విభాగం అధికారులతో సమీక్ష అనంతరం వైద్యారోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ ఈ నిర్ణయం తీసుకున్నారు. ఈ మేరకు ఫుడ్ సేఫ్టీ కమిషనర్ ఉత్తర్వులు జారీ చేయనున్నారు. రాష్ట్రంలో హోటళ్లు, ఫుడ్‌స్టాళ్లలో తరచూ తనిఖీలు చేయాలని సంబంధిత శాఖ అధికారులకు ఈ సందర్భంగా మంత్రి సూచించారు. రాష్ట్రంలో కొత్తగా 3 ఫుడ్ టెస్టింగ్ ల్యాబ్‌లు, 5 మొబైల్ ఫుడ్ సేఫ్టీ ల్యాబ్స్ ఏర్పాటు చేయాలని మంత్రి ఆదేశించారు. మయోనైజ్‌ను ఎక్కువగా.. మండి బిర్యానీ, కబాబ్‌లు, పిజ్జాలు, బర్గర్లు, శాండ్‌విచ్‌లు, ఇతరత్రా ఆహార పదార్థాల్లో చెట్నీలా వేసుకుని తింటారు.

ఇటీవల జరుగుతున్న వరుస ఘటనలతో బల్దియా ఆహార కల్తీ నియంత్రణ విభాగం అప్రమత్తమైంది. ఎన్నిసార్లు చెప్పినా హోటళ్లు తీరు మార్చుకోవట్లేదంటూ ప్రభుత్వానికి లేఖ రాసింది. ఆ పదార్థాన్ని నిషేధించేందుకు అనుమతి కోరింది.

# అయోధ్యలో అట్టహాసంగా దీపోత్సవం



- 25లక్షల దీపాల వెలగింపుతో గిన్నిస్ రికార్డు
- అయోధ్య రామాలయ ప్రతిష్ట తరవాత తొలి ఉత్సవం
- దీపహారతితో ధగధగలాడిన సరయూ తీరం
- దోపోత్సవాన్ని ప్రారంభించిన సిఎం యోగి

2లో

# బంగారం ధరల పరుగులు

- దీపావళికి కలసిరాని కాలం
- పెళ్లిళ్ల సీజన్ కోసం వ్యాపారుల చూపు



2లో




# ప్రభుత్వ ఉద్యోగులకు తీపికబురు

హైదరాబాద్ : ప్రభుత్వ ఉద్యోగులకు తెలంగాణ ప్రభుత్వం దీపావళి సందర్భంగా తీపికబురు చెప్పింది. డీఏ 3.64శాతం పెంచుతూ ఉత్తర్వులు జారీ చేసింది. పెరిగిన డీఏ 2022 జూలై ఒకటో తేదీ నుంచి వర్తించనున్నది. డిసెంబర్ ఒకటిన చెల్లించే నవంబర్ జీతంతో కలిపిన పెరిగిన డీఏ ప్రభుత్వం చెల్లించనున్నది. 2022 జులై ఒకటి నుంచి ఈ నెల వరకు డీఏ బకాయిలు జీపీఎఫ్ ఖాతాలో జమ చేయనున్నది. సీపీఎస్ ఉద్యోగులకు డీఏ బకాయిలు 10శాతం ప్రాన్ ఖాతాకు జమవుతాయి. సీపీఎస్ ఉద్యోగులకు మిగతా 90శాతం 17 వాయిదాల్లో చెల్లించనున్నారు. సీపీఎస్ ఉద్యోగులకు 2025 ఫిబ్రవరి నుంచి 17 వాయిదాల్లో చెల్లించినట్లు ప్రభుత్వ పేర్కొన్నది. జీపీఎఫ్ ఖాతాలు లేని ఫుల్‌టైమ్ కంటింజెంట్ ఉద్యోగులకు సైతం 17 వాయిదాల్లో చెల్లించనున్నది. రిటైర్డ్ ఉద్యోగులకు డీఏ బకాయిలను జనవరి నుంచి 17 వాయిదాల్లో జమ చేయనున్నది. నవంబరు జీతంతో కలిపి పెరిగిన డీఏ చెల్లింపులు చేయనున్నారు. 2022 జులై ఒకటి నుంచి 2024 అక్టోబర్ 31 వరకు డీఏ బకాయిలు జీపీఎఫ్ ఖాతాలో జమ చేయనున్నారు. 2025 మార్చి 31వ తేదీ లోపు పదవీ విరమణ చేసే ఉద్యోగులకు డీఏ బకాయిలు 17 సమాన వాయిదాల్లో చెల్లింపులు చేయనున్నట్టు ప్రభుత్వం ఉత్తర్వుల్లో పేర్కొంది. సీపీఎస్ ఉద్యోగులకు డీఏ బకాయిలు 10 శాతం ప్రాన్ ఖాతాకు జమ చేస్తారు. 90 శాతం 2025 ఫిబ్రవరి నుంచి 17 సమాన వాయిదాల్లో చెల్లింపులు చేయనున్నారు. జీపీఎఫ్ ఖాతాలు లేని ఫుల్ టైం కంటింజెంట్ ఉద్యోగులకు 2025 ఫిబ్రవరి నుంచి 17 సమాన వాయిదాల్లో చెల్లింపులు చేపడతారు.

# అయోధ్యలో అట్టహాసంగా దీపోత్సవం

**అయోధ్య:** రామప్రతిష్ట తరవాత వచ్చిన దీపావళి వెలుగులతో అయోధ్య ధగధగలాడింది. సరయూ తీరం పులకించింది. భక్తజనం పరశించింది. దీపోత్సవంతో అయోధ్య వెలుగులు విరజిమ్మింది. దీపావళి సందర్భంగా అయోధ్యలోని సరయూ నది తీరాన దీపోత్సవాన్ని అట్టహాసంగా నిర్వహించారు. లక్షల ప్రమిదలతో సరయూ తీరం దేదీప్యమానంగా వెలిగిపోయింది. రామమందిరం ప్రారంభమైన తర్వాత తొలిసారి వేడుకలు కావడంతో నిర్వాహకులు భారీ ఏర్పాట్లు చేశారు. గిన్నిస్ రికార్డుల్లోకెక్కేలా ఉత్సవాన్ని పెద్దఎత్తున నిర్వహించారు. ఇందుకు సంబంధించి 55 ఘాట్‌లలో ఏర్పాటు చేసిన ప్రమిదలను ప్రత్యేక డ్రోన్లతో గిన్నిస్ ప్రతినిధులు లెక్కించారు. 25 లక్షల దీపాలను వెలిగించాలని లక్ష్యంగా పెట్టుకున్న నిర్వాహకులు.. దాదాపు 28 లక్షల ప్రమిదలను ముందస్తుగానే ఆర్డర్ చేశారు.

రామమందిరంతోపాటు పరిసర ప్రాంతాలను దీపాలతో అలంకరించారు. దీపోత్సవ కార్యక్రమంలో 30వేల మంది వాలంటీర్లు పాల్గొన్నారు. ఓ ఘాట్ వద్ద 80వేల దీపాలతో స్వస్తిక్ ఆకారంలో దీపాలను వెలిగించారు.

పశుసంవర్ధకశాఖ ఆధ్వర్యంలో ఆవు నెయ్యితో లక్షన్నర దీపాలను వెలిగించారు. ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ ప్రత్యేక పూజలు చేసి.. హారతి కార్యక్రమంలో పాల్గొన్నారు. మయన్మార్,



నేపాల్, థాయిలాండ్, మలేసియా, కంబోడియా, ఇండోనేసియాకు చెందిన కళాకారులతో వేదిక వద్ద ప్రదర్శన నిర్వహించారు.

ఘాట్‌ల వద్ద దాదాపు 5 నుంచి 6వేల మంది అతిథుల కోసం ఏర్పాట్లు చేశారు. లైవ్ కవరేజీ కోసం పెద్ద తెరలు ఏర్పాటు చేశారు. నగరం మొత్తం దాదాపు 10వేల మంది భద్రతా సిబ్బందిని మోహరించారు.

మొత్తంగా బాలరాముడు కొలువైన అయోధ్యలో దీపావళి సంబరాలు కన్నులపండువగా మొదలయ్యాయి.

సరయూ నదీ తీరంలో ఎనిమిదేళ్లుగా ఉత్తరప్రదేశ్ ప్రభుత్వం నిర్వహిస్తున్న 'దీపోత్సవం' ఈసారి మరింత ప్రత్యేకతను సంతరించుకుంది. అయోధ్యలో భవ్య రామాలయం నిర్మాణం జరిగిన తర్వాత జరిగిన తొలి దీపోత్సవం ఇదే కావడంతో అయోధ్య నగరం దీపకాంతులతో మెరిసిపోయింది. యూపీ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ 'దీపోత్సవ్'ను ప్రారంభించగా, భక్తులు ఏకకాలంలో 25 లక్షలకుపైగా దీపాలు వెలిగించి గిన్నిస్ వరల్డ్ రికార్డు సృష్టించారు. సరయూ నది ఘాట్‌లో 1,100 మంది హారతులు ఇవ్వడం ద్వారా మరో సరికొత్త రికార్డు కూడా సిద్ధమైంది. అయోధ్య పురవీధుల్లో లక్షలాది జనవాహిన మధ్య రామలక్షణ వేషధారులు రథంపై ఊరేగగా, ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ స్వయంగా రథం లాగి తమ భక్తిప్రపత్తులను చాటుకున్నారు. లేజర్ షోలు, డ్రోన్ షోలు, రామాయణ ఘట్టాలు, సాంస్కృతిక ప్రదర్శనలతో అయోధ్య మారుమోగింది. రామాలయ నిర్మాణం తర్వాత జరిగిన తొలి దీపోత్సవ్‌ను యోగి ఆదిత్యనాథ్ ప్రారంభిస్తూ, ఈనాటి దీపోత్సవ్ మనందరికీ గర్వకారణమని అన్నారు. ఇది మనమంతా జరుపుకుంటున్న 8వ దీపోత్సవమని చెప్పారు. ఎనిమిదేళ్ల క్రితం తొలి దీపోత్సవ్ జరుపుతున్నప్పుడు... యోగీజీ రామమందిరం నిర్మించడని ప్రతి ఒక్కరూ అడిగేవారని, రాముడు త్వరలోనే మనందరికీ ఆశీర్వదిస్తాడని ఆరోజు చెప్పడం జరిగిందని గుర్తుచేశారు. రామాలయ నిర్మాణం కలసాకారమైనందుకు ప్రధాని మోదీకి మనమంతా కృతజ్ఞతలు చెప్పుకోవాలని అన్నారు. యావద్దేశం కోవిడ్ మహమ్మారితో

పోరాడుతున్న సమయంలో ప్రధాని అయోధ్యకు వచ్చిన రామాలయ నిర్మాణానికి శంకుస్థాపన చేశారని అన్నారు. ఈరోజు అయోధ్య వెలిగిపోతోందని, ఇవాళ వెలుగుతున్నవి కేవలం దివ్వెలు కావని, సనాతన ధర్మ విశ్వాసని చెప్పారు. ఈరోజు మన కాశీ వెలిగిపోతోంది. భవ్య కాశీని ఈరోజు యావత్ ప్రపంచం చూస్తోందని గర్వంగా చెప్పారు. ఈ సందర్భంగా కేంద్ర మంత్రి గజేంద్ర సింగ్ షేకావత్‌తో కలిసి టూరిజం యాప్‌ను, అయోధ్య మేయర్ రాసిన ఒక పుస్తకాన్ని యోగి ఆదిత్యనాథ్ విడుదల చేశారు.

# బంగారం ధరల పరుగులు

**ముంబై:** దేశంలో బంగారం కొనుగోళ్లు తగ్గుతున్నాయి. ధరల కారణంగా బాగా డబ్బున్న వాళ్లు తప్ప పేద, మధ్యతరగతి ప్రజలకు బంగారం అందుబాటులో ఉండడం లేదు. బాంగారం ఏకంగా 80వేలు దాటడం కలవరపెడుతోంది. పెళ్లిళ్ల సీజన్ ఆరంభం కావడం, ధనత్రయోదశి పండగలు వచ్చినా బంగారం కొనుగోళ్లు అంతంత మాత్రంగానే సాగాయి. బంగారం ధరలు స్థిరంగా ఉండడం లేదు. 80వేల మార్కును దాటిన తరవాత కిందికి దిగి రావడం లేదు. రాకుండా వ్యాపారులు కూడా తమవంతు యత్నాలు చేస్తున్నారు. మరోవైపు బంగారం ధర స్థిరంగా ఉన్నప్పటికీ, అటు వెండి ధరలు మాత్రం పెరిగాయి. ఇక కిలో వెండి ధర రూ. లక్షకు చేరుకుంది. పరిశ్రమల యూనిట్లు, నాణెపు తయారీ పరిశ్రమల నుంచి డిమాండ్ పెరగడంతో వెండి ధర పెరిగింది. పుత్తడి ధరలు పెరగడంతో గత సంవత్సరంతో పోలిస్తే అమ్మకాలు కనీసం 30 నుంచి 50 శాతం తగ్గుతాయని మార్కెట్ వర్గాల అంచనా. అయితే దీపావళి, ధంతేరస్ పర్వదినాల సందర్భంగా కొనుగోళ్లు పుంజుకుంటాయని ఆభరణాల పరిశ్రమ ఆశించింది. రికార్డు స్థాయిలో ఎగిసిన పుత్తడి ధరలు స్వల్పంగా తగ్గుముఖం పట్టడంతో కస్టమర్ల తాకిడి ఆశాజనకంగా వుంటుందని భావిస్తున్నారు. దేశీయంగా రిటైల్ మార్కెట్లో కూడా బంగారం పెరుగుతోంది. పెళ్లిళ్ల సీజన్‌లో పసిడి లాభాల సిరులు కురిపిస్తుందనే అంచనాల్లో ఉన్నారు. దీపావళి అంటే దివ్వెలు, వెలుగుల సంబరం మాత్రమేకాదు. పసిడి కాంతుల కళకళలు కూడా. దసరా, దీపావళి పండుగ సీజన్ వచ్చిందంటే నగల వ్యాపారులకు బోలెడన్ని ఆశలు. లక్ష్మీదేవిని పూజించడం ఎంత ముఖ్యంగా భావిస్తారో... దీంతో పాటు బంగారం గానీ, ఏదో ఒక కొత్త వస్తువు కొనడం కూడా అంతే ఆనవాయితీ వస్తున్న క్రమంలో వారికి భారీ అంచనాలే ఉన్నాయి. అయితే ఇటీవల రికార్డు స్థాయికి చేరిన పసిడి దరలు దీపావళి నాటికి దిగి వస్తాయా అని కొనుగోలుదారులు ఆశగా ఎదురుచూస్తోంటే.. కొనుగోళ్లతో తమ షాపులు కళకళ లాడతాయా లేదా అని వ్యాపారులు ఆందోళనపడుతున్నారు. కొనుగోలుదారులు దీపావళికి ఎంతో కొంత బంగారాన్ని తమ సొంతం చేసుకోవాలనే ఆలోచనలో ఉంటారు. అయితే ఆకాశాన్నంటిన ధరలు మరింత దిగిరాకపోతాయా అనే మీమాంసలో చాలా మంది కొనుగోలు దారులున్నారు. క్షణక్షణానికి మారుతున్న అంతర్జాతీయ పరిస్థితుల నేపథ్యంలో పుత్తడి ధర ఏ రోజు ఎంత పెరుగుతుందో.. ఎంత తగ్గుతుందో అంచనా వేయడం ఒకింత కష్టంగా మారింది. ఇదిలా ఉంటే అంతర్జాతీయ పరిస్థితులు, గ్లోబల్‌గా ఆర్థిక వ్యవస్థ మందగమనం, ట్రేడ్‌వార్ తదితర కారణాల రీత్యా మొత్తం వ్యాపారం తక్కువగా ఉంటుందని వ్యాపారులు అంటున్నారు. తక్కువ నుండి మధ్య స్థాయి వరకు జరిగే కొనుగోళ్లు తీవ్రంగా ప్రభావితమవుతాయని చెప్పారు. ధరలు పెరిగినా రానున్న పెళ్లిళ్ల సీజన్ కూడా తమకు కలిసి వస్తుందని భావిస్తున్నారు.

# దగ్గర పడుతున్న అమెరికా అధ్యక్ష ఎన్నికలు

## పోటాపోటీగా ప్రచారం చేస్తున్న ట్రంప్, కమలా
## ప్రవాసభారతీయుల ఓట్లపై ఇరు నేతల గురి

**న్యూయార్క్:** అమెరికా ఎన్నికలకు మరి కొన్నిరోజుల సమయమేఉండడంతో పోటాపోటీ ప్రచారం సాగుతోంది. అటు డొనాల్డ్ ట్రంప్ , ఇటు కమలా హ్యారిస్ ఇద్దరూ పోటాపోటీగా ప్రవాస భారతీయుల్ని ఆకట్టుకునేందుకు ప్రయత్నిస్తున్నారు. ఈ క్రమంలో ప్రవాస భారతీయుల ఓటు ఎటు అన్న చర్చ వస్తోంది. అమెరికా అధ్యక్ష ఎన్నికలు అంటే ప్రపంచం మొత్తానికి ఆసక్తి ఉంటుంది. ప్రపంచంలోని అన్ని దేశాల నుంచి వెళ్లిన జనం అమెరికాలో జీవిస్తూ ఉంటారు. అందుకే అక్కడి ఎన్నికలపై ఎంతో ఉత్సుకత ఉంటుంది. అది రాను రాను పెరుగుతుంది. ఎందుకంటే అక్కడ స్థిరపడిన విదేశీయులు ఓటర్లుగా మారడమే కాదు.. ఇప్పుడు ఆ దేశాన్ని పరిపాలింటే వారిలో భాగం అవుతున్ననారు. ఈ విషయంలో భారతీయులు చాలా ముందు ఉన్నారు. ఒకటి, రెండు తరాలకిందట వెళ్లిన వారు అమెరికా పౌరులుగా మారి
నేరుగా పరిపాలన చేయడానికే పోటీ పడుతున్నారు. కమలాహ్యారిస్ అధ్యక్ష పదవికి అభ్యర్థిగా పోటీ చేస్తూండటం భారతీయ మూలాలున్నవారిని మరింత ఉద్వేగానికి గురి చేస్తోంది. అధ్యక్ష పదవికి పోటీ చేసేలా ఓ భారత మూలాలున్న నేత ఎదిగారంటే ఇక కింది స్థాయిలో వారు ఎంత ప్రభావిత స్థాయిలో ఉన్నారో అర్థం చేసుకోవచ్చు. కమలాహారిస్ భారతీయ మూలాలు ఉన్న మహిళ కావడంతో ఆమెవైపు దక్షిణ భారతానికి చెందిన వారు ఉన్నట్లు తెలుస్తోంది. అమెరికాలో భారతీయులు ఎక్కువగా ఉండే డాలస్ వంటి ప్రాంతాల్లో తెలుగులో కూడా ప్రచార పోస్టర్లు వెలిశాయి. ప్రధాన పార్టీలు ఎన్నారైలను ఆకట్టుకునేందుకు ఇలా చేశాయి. ఇటీవల మెక్ డొనాల్డ్స్ లో పని చేసి ప్రచారం చేసిన ట్రంప్ ఓ భారతీయ అమెరికన్‌కు ఫ్రెంచ్ ఫ్రైస్ అమ్మిన వీడియోను విస్తృతంగా ప్రచారం అయ్యేలా చేసుకున్నారు. భారత మూలాలున్న ఓటర్లు ఇప్పుడు అమెరికా లో కీలకంగా మారారు. అమెరికాలోని భారతీయుల్లో ఎక్కువ మంది డెమొక్రటిక్ పార్టీ, దాని అనుబంధ సంస్థలలో పని చేస్తున్నారు. ప్యూ సర్వే ప్రకారం 68 శాతం రిజిస్టర్డ్ భారతీయ అమెరికన్ ఓటర్లు డెమొక్రటిక్ పార్టీతో ప్రత్యక్షంగా లేదా పరోక్షంగా అనుబంధం కొనసాగిస్తున్నారు. కేవలం 29శాతం మాత్రమే రిపబ్లికన్ పార్టీకి మద్దతు పలుకుతున్నారు. అందుకే రిపబ్లికన్ అభ్యర్థి డొనాల్డ్ ట్రంప్ ఎక్కువగా భారతీయ మూలాలున్న వారిని ఆకట్టుకునేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు. అక్కడే పుట్టి అక్కడే పెరిగిన వారికి పౌరసత్వం లభిస్తుంది. వారి తల్లిదండ్రులు ఏ దేశానికి చెందిన వారు అయినా అమెరికాలో పుడితే పౌరసత్వం తీసుకోవచ్చు. ఆటోమేటిక్‌గా నిబంధనల ప్రకారం వయసు రాగానే ఓటు హక్కు వస్తుంది. అలాగే గ్రీన్ కార్డు పొందిన వారికి కూడా ఓటు ఉంటుంది. ఇలా వేరేదేశాల్లో పుట్టి అమెరికాలో సెటిల్ అయిన వారికి పౌరసత్వం పొందిన వారికి అధ్యక్ష స్థానానికి పోటీ చేసే అవకాశం ఉండదు. కానీ రాష్ట్రాల్లో గవర్నర్ పోస్టుల వరకూ పోటీ చేయవచ్చు. మంత్రులుగా బాధ్యతలు తీసుకోవచ్చు. భారతీయలు ఈ అవకాశంతో కింది స్థాయి నుంచి ఎన్నికల్లో పోటీ చేసి పైకి వచ్చేందుకు ప్రయత్నిస్తున్నారు. డొనాల్డ్ ట్రంప్ విధానాలు భారతీయుల్ని కొంత వరకు కలవరపాటుకు గురి చేస్తున్నాయి. అయితే గతంలో ఆయన అధ్యక్ష పదవిలో ఉన్నప్పుడు పెద్దగా ఇబ్బందులు ఎదురు కాలేదని ఈ సారి కూడా ఎదురు కావని చెప్పి రిపబ్లికన్ పార్టీ మద్దతుదారులు ప్రచారం చేస్తున్నారు. ఈ ఇద్దరిలో ఇండియన్స్ ఎవరి వైపు నిలబడతారన్నది ఎన్నికల ఫలితాల్లో తేలుతుంది.

# ఎక్స్‌రేలా కులగణన

హైదరాబాద్ :కులగణన సర్వేను నవంబరు 30లోగా పూర్తి చేసి.. స్థానిక ఎన్నికలకు సిద్ధమవుదామని కాంగ్రెస్ శ్రేణులకు సీఎం రేవంత్‌రెడ్డి పిలుపునిచ్చారు. ఈ సర్వేపై పార్టీ నేతలకు అవగాహన కల్పించడానికి బుధవారం గాంధీభవన్‌లో పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్ నేతృత్వంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన ప్రసంగించారు. మంత్రులు, ఎమ్మెల్సీలు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, డీసీసీ అధ్యక్షులు, సీనియర్ నాయకులు పాల్గొన్నారు. కులగణన అనేది ప్రజల జీవన స్థితిగతులపై ఎక్స్‌రే మాత్రమే కాదని, అది మెగా హెల్త్‌చెకప్ లాంటిదని సీఎం అన్నారు. ప్రభుత్వ ఆదాయాన్ని సామాజికన్యాయం ప్రకారం పంచడమే కాంగ్రెస్ విధానమని తెలిపారు. 'కులగణన సర్వేపై సమన్వయం కోసం పార్టీ తరఫున 33 జిల్లాలకు 33 మంది పరిశీలకులను పీసీసీ నియమించాలని సూచిస్తున్నాను. పార్టీ నేతలంతా బాధ్యతగా పనిచేయాలి. మీ కష్టానికి ఫలితం తప్పకుండా ఉంటుంది. కులగణనపై రాహుల్‌గాంధీ ఎన్నికల్లో ఇచ్చిన హామీని అమలు చేసే క్రమంలో ఎవరు అభ్యంతరకరంగా వ్యవహరించినా వారిని పార్టీ క్షమించదు. పార్టీకి నష్టం కలిగించేలా ఇష్టానుసారంగా మాట్లాడితే సహించబోం. దేశానికి తెలంగాణ ఒక మోడల్‌గా మారేలా సర్వేను ముందుకు తీసుకెళ్లాలి. తెలంగాణ మోడల్ రాహుల్‌గాంధీని ప్రధానిని చేసేలా ఉంటుంది. ఇక్కడి నుంచే నరేంద్రమోదీపై యుద్ధం ప్రకటించాలి. ఈ సర్వేను దేశవ్యాప్తంగా చేపట్టే జనగణనలో పరిగణనలోకి తీసుకునేలా మోడల్ డాక్యుమెంట్ తయారు చేసి కేంద్రానికి పంపుతాం.

మీరంతా కష్టపడితేనే నాకు సీఎం పదవి

రేవంత్‌రెడ్డికి ప్రత్యేక గుర్తింపు ఏమీ లేదు. కాంగ్రెస్



పార్టీనే ఈ గుర్తింపు ఇచ్చింది. మీరంతా కష్టపడితేనే నాకు సీఎం బాధ్యత వచ్చింది. గాంధీ కుటుంబం మాట ఇచ్చిందంటే మరో చర్చకు తావు లేదు.చర్చకు అవకాశమిచ్చారంటే వారు పార్టీ ద్రోహులే. పార్టీ ఎజెండాతోనే ప్రజల్లోకి వెళ్లాం. పార్టీ విధానాన్ని అమలు చేయడమే ప్రభుత్వ విధానం. అందుకే కాంగ్రెస్ పార్టీ ఐడియాలజీతో సంబంధం ఉన్న నిరంజన్‌ని బీసీ కమిషన్ ఛైర్మన్‌గా నియమించాం. పని చేయాల్సిన బాధ్యత అధికారులపై ఉన్నా ప్రతి క్షణం సమన్వయం చేసుకోవాల్సిన బాధ్యత కాంగ్రెస్ శ్రేణులపై ఉంది. చట్టాన్ని అమలు చేస్తాం తప్ప, వ్యక్తిగత ఎజెండాతో పనిచేయం. ప్రతిపక్షాల కుట్రలను ప్రతి ఒక్కరూ తిప్పికొట్టాలి.

ప్రతిపక్షాలు ఎన్ని అడ్డంకులు సృష్టించినా...

ప్రతిపక్షాలు ఎన్ని అడ్డంకులు సృష్టించినా డీఎస్సీ పూర్తి చేసి ఉపాధ్యాయులుగా ఎంపికైన వారికి నియామకపత్రాలు అందించాం. 10 నెలల్లో 50 వేల ఉద్యోగాలను భర్తీచేశాం. గ్రూప్ 1 విషయంలోనూ ప్రతిపక్షాలు రకరకాల అపోహలు సృష్టించి అడ్డుకోవాలని చూశాయి. తొలుత జీవో 29 ఇచ్చినప్పుడు గానీ, నోటిఫికేషన్ వచ్చినప్పుడు గానీ, ప్రిలిమ్స్ ఫలితాలు వెలువడినప్పుడు గానీ కోర్టుకు పోలేదు. కానీ మెయిన్స్ నిర్వహించే ముందు జీవో 29పై కోర్టుకు వెళ్లి అడ్డుకోవాలని చూశారు. సుప్రీంకోర్టు కూడా వారి పిటిషన్‌ను కొట్టేసింది.


కొంతమంది అగ్రవర్ణాల కోసమే గ్రూప్ 1 నిర్వహిస్తున్నారని, బలహీనవర్గాలకు అన్యాయం చేస్తున్నారనే వాదన తీసుకొచ్చారు. కానీ గ్రూప్-1 మెయిన్స్‌కు ఎంపికైన 31,383 మందిలో 10 శాతం లోపు మాత్రమే అగ్రవర్ణాల వారు ఉంటే బీసీలు 57.11 శాతం, ఎస్సీలు, 15.38, ఎస్టీలు 8.87, ఈడబ్ల్యూఎస్ 8.84 శాతం ఉన్నారు. స్పోర్ట్స్ కోటాలో 20 మంది మెయిన్స్‌కు ఎంపికయ్యారు' అని రేవంత్‌రెడ్డి వివరించారు.

# మూసీ సుందరీకరణతో పేదల ఇళ్ల కూల్చివేత

హైదరాబాద్:మూసీ సుందరీకరణకు తాము అనుకూలమేనని.. అయితే సుందరీకరణ పేరిట స్థిరాస్తి వ్యాపారానికి వ్యతిరేకమని బిఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్‌రావు అన్నారు. మూసీ పేరిట కమిషన్లు, పేదల ఇళ్లను కూల్చడం వంటి వాటిని వ్యతిరేకిస్తున్నామన్నారు. మల్లన్న సాగర్ నిర్వాసిత కాలనీ రాజమౌళి సినిమాను తలపిస్తోందంటూ ఎద్దేవా చేశారు. మల్లన్నసాగర్ బాధితులకు ఒక్క ఇల్లూ కట్టలేదని తప్పుగా మాట్లాడారని.. మల్లన్నసాగర్‌కు 50వేల ఎకరాలు కాదు.. 17వేల ఎకరాలేనన్నారు. 14వేల ఎకరాలు ప్రభుత్వ పట్టా అసైన్డ్ భూమి.. 3వేల ఎకరాలు ఫారెస్ట్ భూమి అని చెప్పారు. ఏడు గ్రామాలు ముంపునకు గురైతే 14 గ్రామాలు అయ్యాయని తెలిపారు. సీఎం ఇలా మాట్లాడుతూపోతే ఇక ఆయన మాటలను ఎవరూ నమ్మరన్నారు. మూసీ బాధితులకు మల్లన్న సాగర్‌కు మించిన పరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. మూసీ బాధితులకు గచ్చిబౌలి భూముల్లో ఇళ్లను నిర్మించి ఇవ్వాలి. హైదరాబాద్ నుంచి వాడపల్లి వరకు పాదయాత్ర చేద్దాం. సీఎం రేవంత్ రెడ్డి సెక్యూరిటీ లేకుండా పాదయాత్రకు రావాలని షరతు విధించారు. మమ్మల్ని డీల్ చేయడం కాదు.. రేవంత్ రెడ్డి తన కుర్చీని కాపాడుకోవాలి. పక్కనున్న వాళ్లే ఆయన్ను దించేయకుండా జాగ్రత్త పడాలి. ప్రభుత్వం వచ్చి ఏడాదైనా.. 6 మంత్రి పదవులు నింపుకోలేదు. ఇప్పుడు ఎన్నికలు జరిగితే భారాసకు 100 సీట్లు రావడం ఖాయమని హరీశ్‌రావు ధీమా వ్యక్తం చేశారు. ఇప్పటికిప్పుడు రాష్ట్రంలో ఎన్నికలు వచ్చినా బీఆర్ఎస్‌కు వంద సీట్లు వస్తాయని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు స్పష్టం చేశారు. తెలంగాణ భవన్‌లో ఆయన బుధవారం మీడియాతో మాట్లాడారు. రేవంత్‌రెడ్డికి సీఎం పదవి కేసీఆర్ పెట్టిన భిక్ష అని స్పష్టం చేశారు. కేసీఆర్ లేకుంటే తెలంగాణ వచ్చేది కాదని.. రేవంత్ సీఎం అయ్యేవాడు కాదన్నారు. కేసీఆర్‌కు, రేవంత్‌కు నక్కకు.. నాగలోకానికి ఉన్నంత తేడా ఉందన్నారు. సీనియర్లు తన కుర్చీని గుంజుకోకుండా రేవంత్ చేసుకోవాలని.. తన కుర్చీని ఎప్పుడు గుంజుకుపోతారోనన్న భయంలో రేవంత్ ఉన్నాడన్నారు. ఐదేళ్ల తర్వాత వచ్చేది బీఆర్ఎస్ మాత్రమేనని.. సీఎం అయ్యేది కేసీఆర్ అని స్పష్టం చేశారు. దేశంలో కాంగ్రెస్ మూడుసార్లు ఓడిందని.. మరి కాంగ్రెస్ ఖతం అయిపోయిందా? అంటూ ప్రశ్నించారు. 31 సాకులు చూపుతూ రుణమాఫీ చేయకుండా రేవంత్ రైతులను మోసం చేశారని విమర్శించారు. మంత్రి పదవులు నింపేందుకే రేవంత్‌కు హైకమాండ్ అనుమతి ఇవ్వట్లేదని.. విద్య, మైనారిటీ, పోలీసుశాఖలకు మంత్రులు, డిప్యూటీ స్పీకర్, చీఫ్‌విప్ లేరన్నారు. కేసీఆర్ పవర్‌ఫుల్ ఫైటర్, లీడర్ అని చెప్పారు. రేవంత్‌రెడ్డి చిల్లరమాటలు ఆపితే మించిదని సూచించారు. ఓ మంత్రి గవర్నర్‌ని కలిశారని.. ఇంకో మంత్రి కాబోయే సీఎంనని సోషల్ మీడియాలో పెట్టుకుంటున్నారని అన్నారు. సీఎం చిట్‌చాట్‌లో మాట్లాడి కుర్చీకి ఉన్న గౌరవం తగ్గించారని మండిపడ్డారు. రేవంత్‌రెడ్డి అబద్దాలు చూసి గోబెల్స్ కూడా సిగ్గుపడుతారన్నారు. రేవంత్ మాట్లాడితే ఎక్కడ ఆ దుర్భాష విని పిల్లలు చెడిపోతారోనని.. ఇండ్లల్లో తల్లిద్రండులు టీవీలను బంద్ చేస్తున్నారని పేర్కొన్నారు. హైదరాబాద్‌కు మూడువైపులా సముద్రం ఉందంటారని.. అలా అయితే గోవా వెళ్లడం ఎందుకని జోకులు వేస్తున్నారన్నారు. రాజీవ్ కంప్యూటర్ కనిపెట్టాడని అంటాడని.. దిల్‌సుఖ్‌నగర్‌లో విమానాలు అమ్ముతారని.. రాజ్యాంగబద్ధమైన పదవిలో ఉండీ ఇలా మాట్లాడుతూ పోతే.. గ్రూప్-1 పరీక్ష రాసేవాళ్లు ఏమైపోవాలని అన్నారు. తాను కొడంగల్‌లో ఓడితే రాజకీయ సన్యాసం తీసుకుంటానని.. సన్యాసం తీసుకోకుండా ఎంపీకి ఎందుకు పోటీశారని నిలదీశారు. శుద్ధమైన నదీ జలాలకు బీఆర్ఎస్ అనుకూలమని.. పేదల ఇండ్ల కూల్చివేతకు వ్యతిరేకమని క్లారిటీ ఇచ్చారు. కాళేశ్వరం మంచినీళ్లు మూసీకి తీసుకురావాలన్నది కేసీఆర్ విజన్ అని తెలిపారు. కొండపోచమ్మ సాగర్ నుంచి మూసీకి నీళ్లు తెచ్చేందుకు కేసీఆర్ డీపీఆర్ చేశారన్నారు. కొండపోచమ్మ సాగర్ కాకుండా మల్లన్నసాగర్ నుంచి ఎందుకు మారుస్తున్నారని ప్రశ్నించారు. రూ.1100కోట్లతో అయ్యే పనిని రూ.7వేలకోట్ల కమిషన్ కోసం పెంచారని మండిపడ్డారు. గచ్చిబౌలిలో 450 ఎకరాలు ప్రభుత్వ భూమి ఉందని.. మూసీ బాధితులకు ఆ స్థలం ఇవ్వాలని డిమాండ్ చేశారు. రూ.75కోట్లకు ఎకరా భూమి అమ్మింది రేవంత్ ప్రభుత్వమేనన్నారు. 2013 యాక్ట్ కంటే బాగా ఇవ్వమని తాము అడుగుతున్నామన్నారు. రేవంత్ పాలనలో ఇండ్లు కూల్చారు తప్పా.. ఒక్కటైనా కట్టారా? అని హరీశ్‌రావు నిలదీశారు. ఏక్ పోలీసింగ్ కోసం పోలీసుల పోరు జరుపుతున్నారని.. రేవంత్ చెప్పిందే వారు అడుగుతున్నారన్నారు.అంబేద్కర్ విగ్రహానికి సీఎం దండ వేయరని.. అక్కడికి ఎవరినీ వెళ్లనీయరంటూ హరీశ్‌రావు ధ్వజమెత్తారు. సీఎం రేవంత్ వైఫల్యాలను ఎండగడుతున్నందుకే కేసులు పెడుతున్నారని ధ్వజమెత్తారు. రేవంత్ తప్పుడు విధానాలతో రియల్ ఎస్టేట్ పడిపోయిందని చెప్పారు. ఇతర రాష్ట్రాల్లో రియల్ ఎస్టేట్ పెరిగిపోతున్నా..



తెలంగాణలో మాత్రం ఎందుకు తగ్గుతోందని నిలదీశారు. హైడ్రా ఎఫెక్ట్‌తో రియల్ ఎస్టేట్ రంగం ధమాల్ ధమాల్ అయ్యిందన్నారు. రేవంత్ వైఫల్యాలను ఎండగడుతున్నందుకే తప్పుడు కేసులు పెట్టున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. తప్పుడు కేసులతో తనను.. కేటీఆర్‌ను ఇరికించాలని చూస్తున్నారని ఆరోపించారు. తమపైనే కాకుండా ప్రశ్నించే గొంతులపైనా కేసులు పెడుతున్నారని మండిపడ్డారు. న్యాయస్థానాలపై తమకు నమ్మకం ఉందన్నారు. హైదరాబాద్‌లో 144 సెక్షన్ పెట్టడం తుగ్లక్ చర్య అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. అవినీతి, దురాలోచనతోనే ఆర్ఆర్ఆర్‌కు రూ.35వేలకోట్ల ఖర్చు అని అంటున్నారని.. కేంద్రం ఫ్రీగా చేస్తున్నప్పుడు తెలంగాణ ప్రభుత్వం ఖర్చు చేయడం ఎందుకని నిలదీశారు.



వేగుచుక్క
TELUGU DAILY NEWS
3
అక్టోబర్ 31 గురువారం 2024

# పాడి పరిశ్రమకు ప్రభుత్వం తోడ్పాటు.

**రాష్ట్ర పాడి పరిశ్రమాభివృద్ధి సమాఖ్య చైర్మన్ అమిత్ రెడ్డి.**
**ఎమ్మెల్యే, కలెక్టర్లతో కలిసి సారంగాపూర్ విజయ డెయిరీ సందర్శన.**
**విజయ పాలనే వినియోగించాలని విజ్ఞప్తి.**

**వేగుచుక్క న్యూస్,నిజామాబాద్, అక్టోబర్ 30**



: పాడి రంగంపై ఆధారపడిన రైతులకు మేలు చేకూర్చాలనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం పాడి పరిశ్రమకు ఇతోధికంగా తోడ్పాటును అందిస్తోందని తెలంగాణ రాష్ట్ర పాడి పరిశ్రమాభివృద్ధి సహకార సమాఖ్య చైర్మన్ గుత్తా అమిత్ రెడ్డి అన్నారు. మునుపెన్నడూ లేనివిధంగా ముఖ్యమంత్రి ఏ.రేవంత్ రెడ్డి రూ. 50 కోట్ల నిధులను విడుదల చేశారని, వీటికి అదనంగా మరో రూ. 10 కోట్లను జతచేసి పాడి రైతుల పాత బకాయిలను చెల్లించడం జరిగిందని తెలిపారు. బోధన్ శాసన సభ్యులు పి.సుదర్శన్ రెడ్డి, కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతుతో కలిసి చైర్మన్ అమిత్ రెడ్డి బుధవారం సారంగాపూర్ లోని విజయ పాల డెయిరీ కేంద్రాన్ని సందర్శించారు. పాల సేకరణ, విక్రయాల తీరు గురించి అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. పాల శీతలీకరణ ప్రక్రియను పరిశీలించి, పాడి రైతులతో భేటీ అయ్యి వారి సమస్యలను ఆలకించారు. ఈ సందర్భంగా సమాఖ్య చైర్మన్ అమిత్ రెడ్డి మాట్లాడుతూ, ఆశించిన స్థాయిలో పాల విక్రయం జరగని కారణంగా విజయ డెయిరీకి పాలు సరఫరా చేస్తున్న రైతులకు బిల్లుల చెల్లింపులలో కొంత జాప్యం జరుగుతోందని అన్నారు. ఈ విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి సాధ్యమైనంత త్వరగా సమస్యను పరిష్కరించేలా కృషి చేస్తున్నామని తెలిపారు. పాడి పరిశ్రమకు బాసటగా నిలిచి పాడి రైతులను ఆదుకోవాలనే సంకల్పంతో ప్రభుత్వం పూర్తి స్థాయిలో సహాయ సహకారాలు అందిస్తోందన్నారు. ఇందులో భాగంగానే జైళ్లు, ఆలయాలు, ఆసుపత్రులు, అంగన్వాడీ కేంద్రాలు తదితర వాటిలో విజయ డెయిరీ పాలనే వినియోగించాలని ప్రభుత్వం మార్గదర్శకాలు విడుదల చేయడంతో పాల విక్రయాలలో గణనీయంగా వృద్ధి ఏర్పడిందని అన్నారు. అయినప్పటికీ ఇంకనూ విజయ డెయిరీ పాల విక్రయాలు మరింతగా పెరగాల్సిన అవసరం ఉందని, అప్పుడే సంస్థ నష్టాలను అధిగమించి పాడి రైతులకు లాభాలు పంచగలుగుతుందని తెలిపారు. ఏమాత్రం కల్తీకి ఆస్కారం లేకుండా స్వచ్ఛతకు మారుపేరు అయిన విజయ డెయిరీ పాలనే అన్ని వర్గాల ప్రజలు విరివిగా వినియోగించేలా విస్తృత స్థాయిలో అవగాహన కల్పించాలని, ఈ దిశగా రైతు సంఘాల ప్రతినిధులు సైతం కృషి చేయాలని కోరారు. రాష్ట్రంలో ప్రతి రోజు విజయ డెయిరీ యూనిట్ల ద్వారా 4.40 లక్షల లీటర్ల పాలను సేకరిస్తుండగా, 3.20 లక్షల లీటర్ల పాల మాత్రమే అమ్మకం అవుతున్నాయని తెలిపారు. మిగులు పాలను మిల్క్ పౌడర్ గా, వెన్నగా మార్చేందుకు చిత్తూరు జిల్లాకు పంపించాల్సి వస్తుండడం వల్ల సంస్థపై ఆర్థిక భారం పడుతోందన్నారు. దీనికితోడు దేశంలోనే మరెక్కడా లేని విధంగా తెలంగాణాలో పాడి రైతులకు అత్యధిక ధర చెల్లించడం జరుగుతోందన్నారు. పొరుగునే ఉన్న మహారాష్ట్రలో లీటరు పాలకు అక్కడి ప్రభుత్వం కేవలం రూ. 23 మాత్రమే ధర చెల్లిస్తోందని, తెలంగాణలో పాడి రైతులకు దాదాపు రెట్టింపు స్థాయిలో రూ. 39 ధర అందిస్తున్నామని చైర్మన్ అమిత్ రెడ్డి వివరించారు. ఇలాంటి పరిస్థితుల్లోనూ పాడి రైతుల ప్రయోజనాలను కాపాడుతూ, వారికి లాభాలు అందించాలనే దిశగా సమాఖ్య కృషి చేస్తోందని, ప్రభుత్వ తోడ్పాటుతో త్వరలోనే సమస్యలు పరిష్కారం అవుతాయని ఆశాభావం వ్యక్తం చేశారు. పాడి పరిశ్రమకు నష్టాలను నివారిస్తూ, లాభాల బాటలో పయనింపజేసేందుకు ఎలాంటి చర్యలు చేపడితే బాగుంటుందో రైతు సంఘాలు కూడా ఆలోచనలు చేయాలని సూచించారు. కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు మాట్లాడుతూ, జిల్లాలో వినియోగం అవుతున్న పాలలో కేవలం పది శాతం మాత్రమే విజయ డెయిరీ పాలను వినియోగిస్తున్నారని అన్నారు. పాడి రైతులు తోడ్పాటును అందిస్తే ఈ సంస్థ నష్టాలను అధిగమించి, లాభాలు పంచగలుగుతుందని సూచించారు. ముల్కనూరులో రైతులు సమాఖ్యగా ఏర్పడి సమిష్టి కృషితో సత్ఫలితాలు సాధించారని, అదే స్ఫూర్తితో జిల్లాలోని పాడి రైతులు కూడా కృషి చేయాలని హితవు పలికారు. ముఖ్యంగా విజయ డెయిరీ పాలు స్వచ్ఛతకు మారుపేరు అనే విషయాన్ని ప్రజలకు తెలియజేస్తూ వారిలో నమ్మకాన్ని పెంపొందించాలని , తద్వారా విక్రయాలు గణనీయంగా పెరిగేలా చొరవ చూపాలన్నారు. విజయ డెయిరీ సంస్థ అభివృద్ధికి జిల్లా యంత్రాంగం తరపున పూర్తి సహాయ, సహకారాలు అందిస్తామని అన్నారు. కాగా, పాల వినియోగం జరిగే అన్ని ప్రభుత్వ కార్యాలయాలలో విజయ డెయిరీ పాలనే వినియోగించాలని శాసన సభ్యులు సుదర్శన్ రెడ్డి సూచించారు. విజయ డెయిరీ సంస్థ ఇబ్బందులను అధిగమించేలా ప్రభుత్వం పూర్తి సహాయ సహకారాలు అందిస్తుందని అన్నారు. స్వేచ్ఛా విఫణిలో విక్రయించే పాలలో కల్తీ జరుగుతున్న ఉదంతాలు అనేకం వెలుగు చూస్తున్నాయని, పిల్లల అనారోగ్యాలకు కల్తీ కారణమవుతోందని ఆందోళన వెలిబుచ్చారు. కల్తీకి అవకాశం లేకుండా శుద్ధమైన విజయ పాలను పాలను ప్రజలు వినియోగిస్తూ పాడి రైతుల అభ్యున్నతికి దోహదపడాలని పిలుపునిచ్చారు . వీరి వెంట రాష్ట్ర రైతు సంక్షేమ కమిషన్ సభ్యులు గడుగు గంగాధర్, సారంగాపూర్ విజయ డెయిరీ యూనిట్ ఉప సంచాలకులు నాగేశ్వర్ రావు, పశు సంవర్ధక శాఖ సంయుక్త సంచాలకులు జగన్నాథచారి, పాడి రైతుల సంఘం ప్రతినిధులు సురేష్, తిరుపతి రెడ్డి తదితరులు ఉన్నారు.

## జిల్లా ప్రజలకు దీపావళి శుభాకాంక్షలు: కలెక్టర్.

**వేగుచుక్క న్యూస్,నిజామాబాద్, అక్టోబర్ 30**



దీపావళి పండుగను పురస్కరించుకుని కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు జిల్లా ప్రజలకు శుభాకాంక్షలు తెలియజేశారు. ప్రజలందరి జీవితాల్లో కష్టాలు అనే కారుచీకట్లు తొలగిపోయి, చిరుదివ్వెల వెలుగుల వలే అనునిత్యం సుఖ సంతోషాలతో విలసిల్లాలని ఆకాంక్షించారు.

చిన్నా పెద్దా తారతమ్యం లేకుండా ప్రతి ఒక్కరూ ఎంతో ఉత్సాహంగా నిర్వహించుకునే దీపావళి పండుగను ప్రమాదాలకు ఆస్కారం లేకుండా తగిన జాగ్రత్తలు పాటిస్తూ, ఇంటిల్లిపాది ఆనందంగా జరుపుకోవాలని హితవు పలికారు.

## మిల్లర్లు ధాన్యం కు బ్యాంక్ పూచికత్తు ఇవ్వాలి.

**- జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్.**

**వేగుచుక్క న్యూస్, కామారెడ్డి అక్టోబర్ 30:**



మిల్లర్లు ధాన్యం కు బ్యాంక్ పూచికత్తు ఇవ్వాలని జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ ఆదేశించారు. కలెక్టరేట్ లోని సమావేశ మందిరం లో బుధ వారం ఏర్పాటు చేసిన సమావేశం లో జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశాల మేరకు 2024-25 సంవత్సరం వరి ధాన్యాన్ని తీసుకునే ప్రతి మిల్లర్ వ్యక్తిగత బ్యాంక్ పూచీకతు తప్పనిసరిగా సమర్పించవలసిందిగా కోరారు. అలాగే మిల్లర్లు ధాన్యాన్ని తొందరగా మిల్లులో దించుకోవాలని ఆయన సూచించారు. అలాగే మిల్లర్లూ, అధికారులు సమన్వయంతో పని చేయాలని ఆయన పేర్కొన్నారు. ఈ సమావేశం లో అదనపు కలెక్టర్ వి.విక్టర్, జిల్లా మేనేజర్ రాజేందర్, డి.సి.ఎస్.ఓ.నరసింహారావు, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

# జనం జీవితాల్లో వెలుగులు నిండాలి.

**జిల్లా ప్రజలకు దీపావళి శుభాకాంక్షలు.**

**అర్బన్ ఎమ్మెల్యే ధన్ పాల్ సూర్య నారాయణ గుప్త.**

**వేగుచుక్క న్యూస్, నిజామాబాద్, అక్టోబర్ 30**

జనం జీవితాల్లో కష్టాలు పోయి వెలుగులు నిండాలని అర్బన్ ఎమ్మెల్యే ధన్ పాల్ సూర్య నారాయణ గుప్త అన్నారు. అర్బన్ నియోజకవర్గం ప్రజలందరికి ఎమ్మెల్యే ధన్ పాల్ బుధవారం దీపావళి పండుగ శుభాకాంక్షలు తెలిపారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, హిందూ పండుగలలో ప్రతి ఒక్క పండుగకు ఒక్కో ప్రత్యేకత ఉండటం హిందూ ధర్మ గొప్పతనం అని పేర్కొన్నారు. భారతదేశం మొత్తం చిన్న, పెద్ద తేడా లేకుండా కుల, మతాలకు అతీతంగా దీపావళి పండుగ జరుపుకుంటారని తెలిపారు. ముఖ్యంగా తెలుగు రాష్ట్రాలలో ఈ పండుగను భక్తి శ్రద్దలతో మహాలక్ష్మి అమ్మవారికి పూజలు చేయడం, నోములు నోచుకోవడం అనవాయితీగా వస్తుందని, చెడుపై మంచి సాధించిన విజయానికి గుర్తుగా ఈ దీపావళి పండుగ జరుపుకుంటారని అన్నారు. దీపావళి ప్రతి ఇళ్ళు లక్ష్మీ కాంతులతో విరాజిల్లుతుందని, ఆ కాంతులు ప్రతి ఒక్కరి జీవితంలో వెలుగులు నింపాలని కోరారు. ప్రజలంతా అష్ట



ఐశ్వర్యాలతో, సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని అన్నారు.

**ప్రజలు జాగ్రత్తలు పాటించాలి.**

ప్రజలందరు బాణాసంచా కాల్చే సమయంలో తగు జాగ్రత్తలు తీసుకోవాలని ఎమ్మెల్యే సూచించారు. ముఖ్యంగా చిన్న పిల్లల విషయంలో తల్లితండ్రులు జాగ్రత్త తీసుకొని ఎటువంటి సంఘటనలు జరగకుండా దీపావళి పండుగను అంగరంగా వైభోవంగా నిర్వహించుకోవాలని అన్నారు.

## రాష్ట్రస్థాయి సాఫ్ట్ బాల్ పోటీలకు "సత్యశోధక్" విద్యార్థులు.


**వేగుచుక్క న్యూస్, సిరికొండ, అక్టోబర్ 30:**



రాష్ట్రస్థాయి సబ్ జూనియర్ (అండర్ 15) సాఫ్ట్ బాల్ ఛాంపియన్షిప్ పోటీలకు సత్యశోధక్ పాఠశాల విద్యార్థులు ఎంపిక అయ్యారు. తెలంగాణ సాఫ్ట్ బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నవంబర్ 2, 3 తేదీలలో మెదక్ జిల్లా మసాయిపేట ప్రభుత్వ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో రాష్ట్రస్థాయి సబ్ జూనియర్ (అండర్ 15) సాఫ్ట్ బాల్ ఛాంపియన్షిప్ పోటీలు జరగనున్నాయి. సాఫ్ట్ బాల్ ఛాంపియన్షిప్ పోటీలకు సత్యశోధక్ పాఠశాల విద్యార్థులు కె. రోహిత్, ఎం. చందులు ఎంపిక కావడం పట్ల ప్రిన్సిపాల్ నర్సయ్య సంతోషం వ్యక్తం చేశారు. ఈనెల 18న ఆర్మూర్ లో జరిగిన జిల్లాస్థాయి సబ్ జూనియర్ సాఫ్ట్ బాల్ ఎంపిక పోటీలలో ఉత్తమ ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయికి విద్యార్థులు ఎంపికయ్యారు. బుధవారం రాష్ట్రస్థాయికి ఎంపికైన కె. రోహిత్, ఎం. చందు .

## యూ ట్యూబర్ హర్షసాయికి ఊరట

**ముందస్తు బెయిల్ మంజూరు చేసిన హైకోర్టు**



**హైదరాబాద్:** లైంగిక వేధింపుల ఆరోపణలు ఎదుర్కొంటున్న ప్రముఖ యూట్యూబర్ హర్ష సాయికి తెలంగాణ హైకోర్టులో ఊరట లభించింది. తనపై పెట్టిన కేసు చెల్లదని హర్ష సాయి హైకోర్టును ఆశ్రయించగా, ఈ కేసుపై విచారించిన న్యాయస్థానం బుధవారం అతడికి ముందస్తు బెయిల్ మంజూరు చేసింది. హర్షసాయిపై సెప్టెంబర్ 24న నార్సింగి పోలీస్ స్టేషన్లో కేసు నమోదైంది. పెళ్లి పేరుతో అత్యాచారం చేశాడంటూ హర్షసాయిపై ఓ యువతి ఫిర్యాదు చేసింది. ఈ మేరకు నార్సింగి పోలీసులు అతడిపై కేసు నమోదు చేశారు. పెళ్లి చేసుకుంటానని నమ్మించి.. హర్ష, అతడి తండ్రి రాధాకృష్ణ తన వద్ద నుంచి రూ. 2 కోట్లు తీసుకున్నారని ఫిర్యాదులో యువతి పేర్కొంది. హర్షసాయితో పాటు అతని తండ్రి రాధాకృష్ణపై కూడా కేసు నమోదు చేశారు. ‡బాధిత యువతి హర్ష సాయితో కలిసి ఓ సినిమా కూడా నిర్మించినట్లు సమాచారం. ఆమెకు సొంత ప్రొడక్షన్ కూడా ఉంది. శ్రీ పిక్చర్స్ బ్యానర్‌లో హర్షసాయి హీరోగా మెగా అనే మూవీని ఆమె నిర్మించారట. బాధిత యువతి.. బిగ్ బాస్ ఓటీటీ కంటెస్టెంట్‌గా చేశారు. లైంగిక వేధింపుల కేసు నమోదు అయినప్పటి నుండి హర్ష సాయి ఎక్కడా కనిపించలేదు. తనపై నమోదైన కేసుపై న్యాయపర పోరాటానికి సిద్ధమని ఇన్‌స్టాగ్రామ్‌లో స్టోరీ షేర్ చేశాడు. హర్ష సాయిను పోలీసులు అదుపులోకి తీసుకునే ముందు నుంచే తన లాయర్ ద్వారా ముందస్తు బెయిల్ కోసం ప్రయత్నాలు మొదలుపెట్టాడు. కానీ చాలాసార్లు బెయిల్ రిజెక్ట్ అయ్యింది. బాధితురాలు కొన్నాళ్లకు హర్ష సాయి తండ్రిపైన కూడా కేసు పెట్టింది. ఇద్దరూ బెయిల్ కోసం ఎన్నో ప్రయత్నాలు చేయగా తాజాగా వారికి బెయిల్ మంజూరైంది.

# కార్మికుల కోసం రాజీలేని పోరాటాలు.

**దేశ స్వాతంత్ర్య ఉద్యమాల్లోనూ యూనియన్ కీలక పాత్ర.**
**ఏఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి వై. ఓమయ్య.**
**ఘనంగా ఏఐటియుసి ఆవిర్భావ దినోత్సవ వేడుకలు.**

**వేగుచుక్క న్యూస్, నిజామాబాద్, అక్టోబర్ 30:**



కార్మికుల కోసం యూనియన్ నాటి నుండి నేటి వరకు రాజీలేని పోరాటాలు నిర్వహిస్తుందని, దేశ స్వాతంత్ర్య ఉద్యమాల్లోనూ తమ సంఘం కీలక పాత్ర పోషించిందని ఏఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి వై. ఓమయ్య అన్నారు.

ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి వద్ద ఏఐటియుసి105వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఓమయ్య మాట్లాడుతూ, 1920 అక్టోబర్ 31న ఏఐటియుసి ఆవిర్భావం జరిగిందని అన్నారు. ఆనాడు భారతదేశానికి సంపూర్ణ స్వాతంత్రం కావాలని పోరాటం నిర్వహించిన ఏకైక కార్మిక సంఘం ఏఐటియుసి అని, బ్రిటిష్ కాలంలోనే కార్మికులకు పిఎఫ్, గ్రాడ్యుటి చట్టాలను తీసుకువచ్చిందని గుర్తు చేశారు. నాటి నుండి నేటి వరకు కార్మికుల సమస్యలపై రాజీలేని పోరాటాలు నిర్వహిస్తున్నామని, కేంద్రంలో అధికారంలో ఉన్న బిజెపి గత పాలనలో కార్మికులు పోరాడి సాగించుకున్న 29 చట్టాలను రద్దుచేసి 4 కోడ్ లుగా మార్చడం, కార్మికుల హక్కులను కాలరాయడమేనని అన్నారు. ఇప్పటికైనా కార్మిక చట్టాలను అమలు చేయాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రాష్ట్రం ప్రభుత్వం ఎన్నికల సందర్భంలో ఉద్యోగ, కార్మికులకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఏఐటియుసి జిల్లా అధ్యక్షులు పి నర్సింగరావు, జిల్లా ఉపాధ్యక్షులు టి. చక్రపాణి, పి. హనుమాండ్లు, జిల్లా నాయకులు రాధా కుమార్, భానుచందర్, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

# నాణ్యతతో అభివృద్ధి పనులు చేయాలి.

**- అర్బన్ ఎమ్మెల్యే దన్ పాల్.**

**వేగుచుక్క న్యూస్, నిజామాబాద్, అక్టోబర్ 30:**

నగరంలో చేపట్టే సీసీ రోడ్, డ్రైనేజీ పనులు నాణ్యతతో నిర్మించాలని అర్బన్ ఎమ్మెల్యే దన్ పాల్ సూర్య నారాయణ అన్నారు.త్వరతగతిన పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని కాంట్రాక్టర్లను, అధికారులను ఆదేశించారు. నగరంలోని 27వ డివిజన్ ఆనంద్ నగర్, 9వ డివిజన్ ఓల్డ్ నాగారం, 41వ డివిజన్ చంద్రశేఖర్ కాలనీ చౌరస్తా లో చేపట్టిన పలు అభివృద్ధి కార్యక్రమాలకు మున్సిపల్ నగర మేయర్ నీతు కిరణ్ తో కలిసి ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతు, జనరల్ ఫండ్ తో ప్రతి డివిజన్ కు పదిలక్షల రూపాయలు మంజూరు చేయడం జరిగిందని అన్నారు. అందులో భాగంగా నగరంలో పలు డివిజన్లో అభివృద్ధి కార్యక్రమాలు సీసీ రోడ్, డ్రైనేజ్ నిర్మాణ పనులకు శంకుస్థాపన చేయడం జరిగిందన్నారు.

నియోజకవర్గం అభివృద్ధి కొరకు తగిన నిధులు మంజూరు చేయాలనీ ఇంచార్జ్ మంత్రి జూపల్లి, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకుపోవడం జరిగిందన్నారు.నగర



అభివృద్ధికి 100 కోట్లు ప్రతేక నిధులు విడుదల చేయాలనీ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గెలిచి పదినెలలు గడుస్తున్న ఎమ్మెల్యేగా తనకు రావలిసిన సొంత నిధులు కూడా రాలేదని, వెంటనే వాటిని కూడా విడుదల చేయాలనీ అన్నారు.




# ఆ వివాదమే రీజన్

లేడీ సూపర్ స్టార్ నయనతార నటించిన అన్నపూరణి సినిమా ఇటీవలే నెట్‌ఫిక్స్‌లో విడుదలైంది. అయితే ఈ సినిమాపై వివాదాలుగ తలెత్తడంతో తాజాగా నెట్‌ఫ్లిక్స్ ఊహించని నిర్ణయం తీసుకుంది. సినిమాను తమ ఓటీటీ నుంచి తీసేసింది. నయనతార 75వ సినిమా అన్నపూరణి గత నెలలో నెట్‌ఫ్లిక్స్‌లో విడుదలై మంచి వ్యూస్ సాధిస్తుంది. అయితే ఈ సినిమాపై హిందూ సంఘాలు అభ్యంతరం తెలపడంతో వివాదం మొదలైంది. శివసేన మాజీ నేత రమేష్ సోలంకి ఈ సినిమాపై కేసు కూడా పెట్టారు. దీంతో మేకర్స్‌పై ఎఫ్ఐఆర్ కూడా నమోదైంది. రెండు రోజుల క్రితం విశ్వహిందూ పరిషత్ నాయకుడు శ్రీరాజ్ నాయర్ కూడా సినిమాపై ఫైర్ అయ్యారు. రాముడు మాంసం తింటాడంటూ కించపరిచేలా సినిమాలో కొన్ని డైలాగులు ఉన్నాయని ఆయన అన్నారు. అలానే ఒక బ్రాహ్మణ అమ్మాయి మాంసాహారాన్ని ఇష్టపడటం, వండటం వంటి సీన్లను కూడా ఆయన వ్యతిరేకించారు. ఈ సినిమాను నెట్‌ఫ్లిక్స్ నుంచి తక్షణమే తొలగించాలని డిమాండ్ చేశారు. దీంతో సినిమాను నిర్మించిన జీ స్టూడియోస్ విశ్వ హిందూ పరిషత్‌కి క్షమాపణలు చెబుతూ సినిమాని నెట్‌ఫ్లిక్స్ నుంచి తొలగించేలా చేసింది. మళ్లీ పెడతారా? అయితే ఇప్పుడు నెట్‌ఫ్లిక్స్ అన్నపూరణి కొత్త వెర్షన్‌ను మళ్లీ పెడుతుందా లేదా అని నయనతార ఫ్యాన్స్ సోషల్ మీడియాలో పోస్టులు పెడుతున్నారు. అయితే ఈ చిత్రం లవ్ జిహాద్‌ను ప్రేరేపించేలా ఉందని, ఒక హిందూ అమ్మాయి నమాజ్ చేసినట్లుగా సినిమాలో చూపించడంపై కూడా హిందూ సంఘాలు మండిపడుతున్నాయి. థియేటర్లో విడుదలైనప్పుడు సినిమాపై పెద్దగా విమర్శలు ఏమీ రాలేదు. కానీ ఓటీటీలో రిలీజ్ అయిన తర్వాత ఎక్కువ మందికి రీచ్ కావడంతో సినిమాపై వివాదం మొదలైంది.







## రాజమౌళి- మహేశ్ బాబు కాంబినేషన్

సినిమాను 15 ఏళ్ల క్రితమే ఫిక్స్ చేశాం నిర్మాత కె.ఎల్ నారాయణ రాజమౌళిదర్శకత్వంలో మహేష్‌బాబు హీరోగా 'ఎస్ఎస్ఎంబీ 29 చిత్రాన్ని నిర్మిస్తున్నారు. 'హలో బ్రదర్', 'ఇంట్లో ఇల్లాలు వంటింట్లో ప్రియురాలు', 'సంతోషం' వంటి హిట్ చిత్రాలను నిర్మించిన ఆయన సుదీర్ఘ విరామం తర్వాత ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. గతంలో ఓ సందర్భంలో మహేష్, రాజమౌళి కలయికలో భారీ బ్జడెట్ చిత్రం చేయబోతున్నాం అని వెల్లడించారు కానీ అంతకుమించి ఆ సినిమా గురించి ఎక్కడా నోరు మెదపలేదు. తాజాగా ఆయన ఓ వేదికపై రాజమౌళికి కృతజ్ఞతలు తెలిపారు. తనకిచ్చిన మాట నిలబెట్టుకున్నారని నిర్మాత కె.ఎల్. నారాయణ అన్నారు. ఎస్ఎస్ఎంబీ 29 చిత్రాన్ని వాళ్లే స్వయంగా ప్రకటించి, పనిపై ఉన్న నిబద్ధతను చాటారని కొనియాడారు. తాజాగా ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న ఆయన ఉద్దేశపూర్వకంగా నిర్మాతగా విరామం తీసుకోలేదన్నారు. రాజమౌళి–మహేశ్ బాబు కాంబినేషన్ సినిమాను 15 ఏళ్ల క్రితమే ఫిక్స్ చేశాం. ఇప్పుడు వాళ్లిద్దరి క్రేజ్ మరో స్థాయిలో ఉంది. అయినా ఇచ్చిన మాటకు కట్టుబడి నాకు సినిమా చేస్తున్నారు. నేను చెప్పకపోయినా 'దుర్గా ఆర్ట్స్ బ్యానర్'లో మూవీ తీయనున్నట్లు వాళ్లే ప్రకటించారు. అందుకు వాళ్లకి కృతజ్ఞుడిని.
రాజమౌళికి హాలీవుడ్ నుంచీ ఆఫర్లు వచ్చాయి. వాటిని కాదనుకుని నా కోసం సినిమా చేస్తున్నారు.
రెండు నెలల నుంచి ప్రీ ప్రొడక్షన్ వర్క్ జరుగుతోంది. నిర్మాతలు కథా చర్చల్లో పాల్గొనరు అనే మాట ఇండస్ట్రీలో ఎక్కువ వినిపిస్తుంటుంది. అది అందరి విషయంలో నిజం కాదు. రాజమౌళి ప్రతి విషయాన్ని నిర్మాతలతో పంచుకుంటారు. పేపర్ వర్క్ చేస్తున్నప్పుడే క్లారిటీ ఉండడం మంచిదనే ఉద్దేశంతో ఏమైనా సందేహం ఉంటే చెప్పమని అడుగుతారు.

## టిల్లూ క్యూబ్‌లో పూజా హెగ్డే

అగ్ర కథానాయిక పూజాహెగ్డేకు గత కొంతకాలంగా అదృష్టం కలిసి రావడం లేదు. వరుస పరాజయాలతో ఈ భామ కెరీర్ సాగుతున్నది. ప్రస్తుతం సినిమాలకు కాస్త బ్రేక్‌నిచ్చి కుటుంబ సభ్యులతో విరామ సమయాల్ని గడుపుతున్నది. తాజా సమాచారం ప్రకారం తెలుగు ఇండస్ట్రీ నుంచి ఈ అమ్మడు ఓ గుడ్‌న్యూస్‌ను అందుకున్నట్లు తెలిసింది. వివరాల్లోకి వెళితే..టిల్లు, టిల్లు స్వేర్ చిత్రాలు యువతరంలో మంచి ఆదరణ దక్కించుకున్నాయి. టిల్లు పాత్రలో హీరో సిద్ధు జొన్నలగడ్డ తనదైన మేనరిజమ్స్, హైదరాబాదీ కామెడీతో ఆకట్టుకున్నారు. ఈ రెండు చిత్రాలకు కొనసాగింపుగా 'టిల్లు క్యూబ్' తెరకెక్కబోతున్న విషయం తెలిసిందే. ప్రస్తుతం ఈ సినిమా స్క్రిప్ట్‌ను సిద్ధం చేసే పనిలో ఉన్నారు హీరో సిద్ధు జొన్నలగడ్డ. తాజా సమాచారం ప్రకారం ఈ సినిమాలో కథానాయికగా పూజాహెగ్డేను ఎంపిక చేసినట్లు తెలిసింది. డీజే టిల్లు, టిల్లు స్వేర్ చిత్రాల్లో కథానాయిక పాత్రలకు చాలా ప్రాధాన్యత ఉన్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో మూడో భాగంలో పూజహెగ్డేను కథానాయికగా తీసుకోబోతున్నారని వార్తలొస్తున్నాయి. అయితే ఈ వార్తలో నిజమెంతో తెలియాలంటే చిత్ర బృందం నుంచి అధికారిక ప్రకటన రావాల్సిందే.





## అందరూ అవకాశవాదులే!..





శశివదనే సినిమాతో అందరినీ ఆకట్టుకునేందుకు రెడీగా ఉంది యూనిట్. ఈ మధ్యే టీజర్ లాంచ్ చేసి అందరిలోనూ ఆసక్తిని పెంచేశారు. శశివదనే సినిమాతో నిర్మాతగా రెండో సారి తన అదృష్టాన్ని పరీక్షించుకుంటున్నారు అహితేజ. అలాంటి నిర్మాత ప్రస్తుతం వేసిన ట్వీట్ చర్చానీయాంశంగా మారింది. టాలీవుడ్‌లో ఇప్పుడు చిన్న చిత్రాలు, చిన్న నిర్మాతలు వండర్లు క్రియేట్ చేస్తున్నారు. పెట్టిన పెట్టుబడికి పదింతలు లాభాలను తెచ్చి పెడుతున్నారు. అలాంటి ఓ చిన్న సినిమాగా శశివదనే రాబోతోంది. టీజర్‌తో ఒక్కసారిగా అంచనాలు పెరిగాయి. శశివదనే సినిమాతో హిట్టు కొట్టేస్తామని నిర్మాత అహితేజ బెల్లంకొండ ధృడ నమ్మకంతో ఉన్నారు. ఫుల్ పాజిటివ్ ఇమేజ వచ్చిన ఈ సినిమాను మరింతగా ప్రమోట్ చేసేందుకు సోషల్ మీడియాలో నిర్మాత ఎప్పుడూ యాక్టివ్‌గా ఉంటూ పోస్టులు వేస్తుంటాడు. అలాంటి నిర్మాత అహితేజ తాజాగా ఓ ట్వీట్ అందరినీ ఆశ్చర్యంలో ముంచెత్తాడు. ఆ ట్వీట్‌ను గమనిస్తే.. నిర్మాత అహితేజ కాస్త నిరాశలో ఉన్నట్టుగా కనిపించింది. ఎవరి దగ్గరో ఏదో సహాయాన్ని అర్థించి వెళ్తే.. అక్కడ ఆశించింది దొరక్క పోవడంతో హర్ట్ అయినట్టుగా కనిపిస్తోంది. అందుకే ఈ విధంగా ట్వీట్ వేసినట్టుగా అనిపిస్తోంది. ఇంతకీ ఆ ట్వీట్‌లో ఏముందంటే..'ఎవరైనా, ఎవరికైనా ఏ సాయమైనా చేయండి.. వారిని ప్రోత్సహించండి.. కానీ వారి నుంచి తిరిగి ఏమీ ఆశించకండి.. మనుషుల్లో విధేయత అనేది లేదు.. అంతా అవకాశవాదులే.. ముఖ్యంగా సినిమా ఇండస్ట్రీలో' అని ట్వీట్ వేశాడు. అంటే నిర్మాత అహితేజ గతంలో ఎవరికో సాయం చేసో, ఎంకరేజ్ చేసో ఉంటాడు. మళ్లీ ఇప్పుడు వెళ్లి ఏదైనా సాయం అడిగి ఉంటాడు. కానీ అవతలి నుంచి రెస్పాన్స్ రాకపోవడంతో ఇలా ట్వీట్ వేసి ఉంటాడనిపిస్తోంది. తన సినిమా రిలీజ్‌కు దగ్గర పడుతుండటంతో ప్రమోషన్స్ కోసం ఏమైనా సంప్రదించి ఉంటాడని, కానీ అవతలి నుంచి అహితేజకు సాయం అందలే దనిపిస్తోంది. అయినా ఓ సినిమాకు కంటెంట్ అనేది ముఖ్యం. కంటెంట్ ఉంటే ఎవరు సాయం చేసినా, చేయక పోయినా ఆడియెన్స్ అండగా నిలబడతారు. సినిమా నచ్చితే జనాలే ఎగబడి చూస్తారు. కనక వర్షాన్ని కురిపి స్తారు. ఇక అహితేజ పెట్టిన ట్వీట్ మీద నెటిజన్లు స్పందిస్తున్నారు. ఇండస్ట్రీలో విలువలు అనేవి ఉండవు అని ఓ నెటిజన్ ట్వీట్ పెడితే.. దానికి అహితేజ ఇలా స్పందించాడు. సాయం చేసే తత్త్వం, ఫ్యానిజం నుంచి వచ్చానుగా.. అలవాటు పడేందుకు టైం పడుతుంది అంటూ సెటైర్ వేశాడు. ఓ మెగా ఫ్యాన్‌గా వచ్చిన అహితేజ.. ఎదిగి ఈ స్థాయికి వచ్చాడు. ఇక శశివదనే బ్లాక్ బస్టర్ అయితే అహితేజ నెక్స్ట్ లెవెల్‌కు వెళ్తాడు.

## వెరైటీ ప్రమోషన్స్‌పై గురి

అనసూయ అరి చిత్రం ఒకటి విడుదలకు సిద్ధంగా ఉన్న సంగతి తెలిసిందే. అయితే ఈ మద్యే అనసూయ తన ప్రాజెక్టుల మీద స్పందించింది. అందులో అరి కూడా ఉంది. తాజాగా అరికి సంబంధించిన ఓ అప్డేట్ వచ్చింది. పేపర్ బాయ్ వంటి సెన్సిబుల్ స్టోరీతో అందరినీ ఆకట్టుకునేలా తీశాడు దర్శకుడు జయశంకర్. పేపర్ బాయ్ సినిమాతో హీరోగా సంతోష్ శోభన్‌ను నిలబెట్టేశాడు జయశంకర్. ఇక రెండో ప్రాజెక్ట్‌ను జయ శంకర్ పూర్తి చేశాడు. అనసూయ, సాయి కుమార్, శుభలేఖ సుధాకర్ ఇలా భారీ క్యాస్టింగ్‌తో అరి అనే చిత్రాన్ని తీశాడు. అరిషడ్వర్గాలు అనే కాన్సెప్టుతో ఆరు కథలను చూపించేలా అరి చిత్రం ఉంటుందని టీజర్ ద్వారా చూపించాడు. అరి చిత్రం నుంచి కృష్ణుడి మీద కంపోజ్ చేసిన పాట అందరినీ ఆకట్టుకుంది. మంగ్లీ పాడిన ఈ పాట అప్పట్లో బాగానే ట్రెండ్ అయింది. అయితే ఇప్పుడు అరి అనే చిత్రాన్ని వినూత్నంగా ప్రచారం చేస్తున్నారు. లోకల్‌గా అరిని తీసుకెళ్లే ప్రయత్నం చేస్తున్నారు. మంగ్లీ పాడిన ఈ కృష్ణుడి సాంగ్‌ను కరీంనగర్‌లో లోకల్‌గా లోకల్ సింగర్లతో పాడిస్తున్నారు. అలా వీధుల్లో అరి పాట మార్మోగిపోతోంది. తిమ్మప్ప నాయుడు పురిమెట్ల, శేషు మారం రెడ్డి, శ్రీనివాస రామిరెడ్డి నిర్మించిన ఈ చిత్రంలో సూర్య పురిమెట్ల, వినోద్ నటించారు. ఇక ఈ చిత్రంలో వైవా హర్ష సైతం ఓ పాత్రలో కనిపిస్తాడు. తాజాగా ఈ చిత్రం గురించి అనసూయ స్పందించింది. అనసూయ రీసెంటుగానే తన అభిమానులతో ముచ్చటించింది. ఈ క్రమంలో ఓ ఫ్యాన్ అనసూయ చేసిన చిత్రాల లిస్ట్ పెట్టి వీటిలో ఏ సినిమా ఎప్పుడు వస్తుందని అడిగాడు. అందులో అరి కూడా ఉంది. ఆ సినిమాల షూటింగ్ అయితే కంప్లీట్ అయిందని, విడుదల అనేది నిర్మాత చేతిలో ఉంటుందని, అవెప్పుడు వస్తాయా? అని తాను కూడా ఎదురుచూస్తున్నట్టుగా తెలిపింది.

## భారీ క్యూ ఉంది.. ఏది ఫైనల్ చేస్తారో

### చిరంజీవి ఓకే కోసం దర్శకుల ఎదురుచూపులు



చిరంజీవి నటిస్తున్న తాజా చిత్రం 'విశ్వంభర' చిత్రీకరణ తుదిదశలో ఉంది. సంక్రాంతికి ప్రేక్షకుల ముందుకు రావలసింది కానీ పలు కారణాలతో వెనక్కి వెళ్లింది. ఈ చిత్రం తర్వాత చిరంజీవి తదుపరి చిత్రం ఏంటనేది ఇప్పుడు చర్చ. ఈ విషయంపై చిరంజీవి కూడా ఎలాంటి స్పష్టత ఇవ్వలేదు. 'విశ్వంభర' సంక్రాంతి తర్వాత విడుదల కాబట్టి చిరంజీవి కూడా నెక్స్ట్ ఏంటి అనే విషయంలో కూల్‌గా ఉన్నారు. అయితే ఆయనతో సినిమా కోసం పలు దర్శకులు, రచయితలు వాళ్ల పనులతో బిజీగా ఉన్నారు. చిరు సిగ్నల్ ఇస్తే సెట్స్ మీదకు వెళ్లడానికి కంగారుగా ఉన్నారు. రచయిత, దర్శకుడు బీవీఎస్ రవి చిరంజీవికి ఓ కథ చెప్పారు. అయితే దర్శకుడు మాత్రం ఆయన కాదు. మోహన్ రాజాతో కలిసి ఆయన వర్క్ చేస్తున్నారు. కథ దాదాపుగా సిద్ధమైంది. చిరు 'ఓకే' అంటే ప్రాజెక్ట్ సెట్ అయిపోయినట్లే. చిరంజీవి కోసం బీవీఎస్ రవి ఓ సామాజిక సందేశం నిండిన కథ రాశారట. 'ఠాగూర్' తరహా సినిమా అని, బలమైన సందేశంతో పాటు, కమర్షియల్ హంగులన్నీ ఉంటాయని తెలుస్తోంది. ఇదే విషయంపై బీవీఎస్ రవి కూడా ఓ స్టేట్‌మెంట్ ఇచ్చారు. "చిరంజీవి అంటే, పాటలు డాన్సులు గుర్తొస్తాయి. ఆ తరహా చిత్రాలు ఆయనే ఎన్నో చేశారు. అలాగే సందేశాత్మక చిత్రాలు చేశారు. వాటిని ప్రేక్షకులు ఎంతగానో ఆదరించారు. ఓ పెద్ద స్టార్ బలమైన సందేశాన్ని ఇస్తే , చాలామందికి చేరువ అవుతుందని, తాను అలాంటి కథే సిద్ధం చేశానని చెప్పుకొచ్చారు బీవీఎస్ రవి. 'విశ్వంభర' తమ సినిమానే మొదలవుతుందని కూడా చెప్పారు. గతంలో కల్యాణ్ కృష్ణ కురసాల దర్శకత్వంలో ఓ సినిమా అనుకున్నారు. అది పట్టాలెక్కలేదు. అది కూడా క్యూలో ఉందా లేదా అనేది చూడాలి. హరీష్ శంకర్ కూడా ఒక సినిమా చేయాలనే ఆలోచనలో ఉన్నారు. 'విశ్వంభర' తరవాత ఏ సినిమా చేయాలన్న విషయంలో చిరంజీవి ఇంకా ఎలాంటి నిర్ణయం తీసుకోలేదని ఆయన సన్నిహితులు చెబుతున్నారు.

## తలైవా జీవితం ఆధారంగా చిత్రం



అభిమాన హీరోను తెరపై చూస్తే ఫ్యాన్స్ ఆ కిక్కే వేరుగా ఉంటుంది. ఇక వారు చేసే యాక్షన్ వెండితెరపై ఆవిష్కరించ చేస్తే ఆనందంలో మునిగి తేలుతుంటారు ప్రేక్షకులు. తాము అభిమానించే హీరో జీవితం తెరపైకి వస్తే సినీ ప్రియులకు పండగే. బాలీవుడ్‌లో ఎన్నో విజయవంతమైన చిత్రాలతో దర్శకనిర్మాతగా గుర్తింపు తెచ్చుకున్న సాజిద్ నదియావాలా అలాంటి ప్రయత్నంలోనే ఉన్నారు. ప్రస్తుతం ఆయన తమిళ అగ్ర నటుడు అగ్ర కథానాయకుడు రజనీకాంత్ బయోపిక్‌ను రూపొందించడానికి సన్నాహాలు చేస్తున్నారని టాక్ వినిపిస్తోంది. 'సాజిద్ కేవలం రజనీకాంత్ నటనకు మాత్రమే కాదు. ఆయన వ్యక్తిత్వానికి కూడా వీరాభిమానులుంటారు. ఆయన చేసే సేవలు ఎంతో స్ఫూర్తిదాయకం. అయితే ఆయన గురించి పూర్తి విషయాలు ఎవరికీ తెలియదు. అందుకే ఆయన జీవితాన్ని తెరపై చూపించాలని సాజిద్ నిర్ణయించు కున్నారని సన్నిహిత వర్గాలు తెలిపాయి. బస్ కండక్టర్ నుంచి సూపర్ స్టార్ వరకూ ఆయన ఎలా ఎదిగారు, ఎక్కే ఒక్కోమెట్టులో ఎలాంటి సవాళ్లను ఎదుర్కొన్నారు అన్నది సినిమాగా తీర్చిదిద్దడానికి సన్నాహాలు చేస్తున్నారు. ఇప్పటికే ఆయన ఈ కథపై చర్చలు చేస్తునట్లు, ఆయన కుటుంబంతో చర్చలు జరుపుతున్నారని' అని సన్నిహిత వర్గాలు తెలిపాయి. ఇప్పటికే ఈ సినిమా స్క్రిప్ట్ పనులు కూడా మొదలయ్యాయట.గతేడాది 'జైలర్'తో భారీ విజయం అందుకున్నా తలైవా ఈ ఏడాది తన కూతురు దర్శకత్వంలో వచ్చిన లాల్ సలామ్ చిత్రంతో పరాజయాన్ని చవిచూశారు. ప్రస్తుతం ఆయన వేట్టయాన్' చిత్రంతో బిజీగా ఉన్నారు. టి.జె జ్ఞానవేల్ ఈ చిత్రానికి దర్శకుడు.



## కంగువ విషయంలో ఆందోళన అదే..!

లేటెస్ట్ గా సినిమా షూటింగ్ పూర్తైందని చెప్పగా కనీసం ఇప్పటి నుంచైనా సరే సినిమా అప్డేట్స్, ప్రమోషన్స్ మొదలు పెడతారా అని సూర్య ఫ్యాన్స్ సోషల్ మీడియాలో కామెంట్ చేస్తున్నారు. కోలీవుడ్ హీరో సూర్య డైరెక్టర్ శివ కాంబినేషన్ లో భారీ బడ్జెట్ మూవీగా వస్తున్న సినిమా కంగువ. పీరియాడికల్ కథతో భారీ సెట్టింగులతో వస్తున్న ఈ సినిమా అప్పుడెప్పుడో వచ్చిన టీజర్ తప్పించి మరో అప్డేట్ బయటకు రాలేదు. సూర్య డిఫరెంట్ రోల్ లో కనిపిస్తున్న ఈ సినిమా పాన్ ఇండియా వైడ్ గా భారీ రిలీజ్ చేస్తున్నారు. నేషనల్ వైడ్ గా రిలీజ్ అయ్యే సినిమా ఏదైనా సరే సెట్స్ మీద ఉన్నప్పటి నుంచి ఆ ప్రాజెక్ట్ మీద బజ్ పెంచాల్సి ఉంటుంది. కానీ కంగువ టీం ఆ విషయాన్ని లైట్ తీసుకుంటున్నట్టు ఉన్నారు. సూర్య ఫ్యాన్స్ కంగువ అప్డేట్స్ కోసం ఈగర్ గా ఎదురుచూస్తున్నా చిత్ర యూనిట్ మాత్రం ఎలాంటి న్యూస్ బయటకు రానివ్వట్లేదు. లేటెస్ట్ గా సినిమా షూటింగ్ పూర్తైందని చెప్పగా కనీసం ఇప్పటి నుంచైనా సరే సినిమా అప్డేట్స్, ప్రమోషన్స్ మొదలు పెడతారా అని సూర్య ఫ్యాన్స్ సోషల్ మీడియాలో కామెంట్ చేస్తున్నారు. పాన్ ఇండియా రిలీజ్ అయ్యే సినిమాల విషయంలో టాలీవుడ్ మేకర్స్ తీసుకునే జాగ్రత్తలు వేరే లెవెల్ లో ఉంటాయి. ఈ విషయంలో కంగువ టీం చాలా వెనుకబడిందని చెప్పొచ్చు. సూర్య సరసన దిశా పటాని నటిస్తున్న కంగువ సినిమాకు దేవి శ్రీ ప్రసాద్ మ్యూజిక్ అందిస్తున్నారు. డిఫరెంట్ స్టోరీ.. డిఫరెంట్ సెటప్ తో వస్తున్న కంగువ మీద అంచనాలు పెంచేందుకు దర్శక నిర్మాతలు ప్రయత్నిస్తున్నారు. అయితే ముందు సినిమా ప్రమోషన్స్ మొదలు పెడితే ఆటోమేటిక్ గా కావాల్సినంత బజ్ వస్తుందని సూర్య ఫ్యాన్స్ అభిప్రాయపడుతున్నారు. ఈమధ్య కమర్షియల్ సినిమాలకు దూరంగా సోషల్ మెసేజ్ సినిమాలు చేస్తూ వచ్చిన సూర్య కెరీర్ లో ఫస్ట్ టైం ఒక భారీ పీరియాడికల్ సినిమాతో వస్తున్నారు. కంగువ సినిమాను స్టూడియో గ్రీన్, యువి క్రియేషన్స్ కలిసి నిర్మిస్తున్నారు.